## క్లుప్తంగా

### జనాభా ప్రాతిపదికనే బాపట్ల పార్లమెంట్ ఎస్సీకి రిజర్వ్

**మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి**

**సాక్షి ప్రతినిధి, బాపట్ల:** జనాభా ప్రాతిపదికనే బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని ఎస్సీకి రిజర్వ్ చేసినట్టు మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన సందర్భంగా అసెంబ్లీ నుంచి తాను, కిరణ్‌కుమార్‌రెడ్డి, మండలి బుద్ధప్రసాద్ తదితరులు సభ్యులుగా ఉన్నామని పేర్కొన్నారు. అలాగే పార్లమెంట్ సభ్యుల నుంచి ఎస్.జనార్దన్‌రెడ్డి, వివేకానందరెడ్డి, వెంకటస్వామి సభ్యులుగా ఉన్నారని వివరించారు. నియోజకవర్గాల పునర్విభజన కార్యక్రమం పకడ్బందీగా జరిగిందని పేర్కొన్నారు. బాపట్ల పార్లమెంట్ పరిధిలో చాలా నియోజకవర్గాలలో ఎస్సీ జనాభా అధికంగా ఉందని, అందుకే ఎస్సీకి రిజర్వ్ చేసినట్టు తెలిపారు.

### నేత్రపర్వం.. వేణుగోపాలుని కల్యాణం



**భట్టిప్రోలు:** భట్టిప్రోలులో కొలువైన రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం స్వామి, దేవేరుల వార్షిక కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు అద్దేపల్లి నాగ వెంకట శేషాచార్యులు, అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బొలిశెట్టి బాలకృష్ణ దంపతులు స్వామి కల్యాణంలో పాల్గొన్నారు. మహిళా భక్త మండలి నిర్వహించిన కోలాటం ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు.

### కర్లపాలెం ఎంపీడీఓగా రాంబాబు

**కర్లపాలెం:** కర్లపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా దాసరి రాంబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో గుంటూరు జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహించారు. మండల ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాంబాబు తెలిపారు. తొలిరోజు ఆయన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో మాట్లాడారు. ఉపాధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### తహసీల్దార్‌గా కవిత బాధ్యతల స్వీకారం



**పిట్టలవానిపాలెం:** తహసీల్దార్‌గా కవిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె బాపట్ల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ చిన్నం సుధారాణి బాపట్ల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. కవితను డెప్యూటీ తహసీల్దార్ శ్రీచరణ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తహసీల్దార్ కవిత మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సేవలు అందిస్తామని వివరించారు.

### వైభవంగా శాంతి కల్యాణోత్సవాలు ప్రారంభం



**జిఎస్‌పాలెం(పిట్టలవానిపాలెం):** గోకరాజునల్లిబోయినవారిపాలెం శివారు శ్రీనివాసపురంలోని లక్ష్మీ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శాంతి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామికి సుదర్శన హోమాత్మక అష్టోత్తర శత కలశ స్నపన నిర్వహించారు. 108 కలశాలతో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. నవగ్రహ దోషాల నివారణ పూజల గురించి అర్చకులు వివరించారు. గురువారం స్వామికి శాంతి కల్యాణం జరుగుతుందని, అనంతరం అన్న సంతర్పణ ఉంటుందని వెల్లడించారు.

### వలంటీర్ అంకితభావం

- 50 కిలోమీటర్ల దూరం వెళ్లి పింఛన్ అందజేత



**పిట్టలవానిపాలెం:** విధుల్లో అంకితభావం చూపారు ఓ వలంటీర్. అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామానికి చెందిన ఓ వితంతు మహిళ మానసిక ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో ఎరుకలపూడిలోని వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఆమెకు మంజూరైన పింఛన్ మొత్తాన్ని వలంటీర్ శివనాగులు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎరుకలపూడికి వెళ్లి అందించారు.

## • నమో.. నారసింహా..





అల్లూరులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి సహస్రాబ్ది అనంతర చతుర్థ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున నరసింహస్వామి కల్యాణం నేత్రపర్వంగా ముగిసింది. అనంతరం ఉభయకర్తలు యల్లాప్రగడ శేషాచలపతిరావు కుటుంబీకులచే స్వామికి గరుడ వాహనంపై గ్రామోత్సవం జరిపించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ముఖ్యంగా ఆలయ ఆవరణలో విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిరూపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి, కార్యనిర్వహణాధికారి ఎంవీఎస్ వర్మ పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం నుంచి స్వామి ఆలయ ఆవరణలో ఆరు వేల మందికి అన్నసంతర్పణ నిర్వహించారు.

–అల్లూరు(పిట్టలవానిపాలెం)

## • గుండెపాటెమ్మా.. వందనం





పేటేరు గ్రామదేవత మారిడి మహాలక్ష్మి గుండెపాటెమ్మ తిరునాళ్ల మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. అమ్మవారికి వేకువజామునే సుప్రభాత సేవ నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు. పట్టువస్త్రాలు, పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి సారె, సద్దినైవేద్యాలు సమర్పించారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులు ప్రభలను ఏర్పాటు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. సర్పంచ్ కనపర్తి వసుమతి, సచివాలయ సెక్రటరీ పుష్పకుమారి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకర్, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి కిరణ్‌కుమార్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

- రేపల్లె రూరల్

## • గోగులమ్మా.. నమోస్తుతే



ప్రత్యేక అలంకారంలో గోగులమ్మ అమ్మవారు

భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మ వార్షిక మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి పుట్టినింటివారి తరఫున గ్రామానికి చెందిన కొసరాజు రాధాకృష్ణ మూర్తి, కొసరాజు రమేష్‌బాబు దంపతులు పసుపు,కుంకుమ సమర్పించారు. అనంతరం సహస్ర కుంకుమార్చన జరిగింది. సాయంత్రం వడ్లమూడి వరప్రసాదరావు ఆధ్వర్యంలో సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. చిన్నారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. గురువారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు, మొక్కుబడులు సమర్పించుకుంటారు. ఉత్సవాల్లో విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

- భట్టిప్రోలు

# నూరుశాతం హామీల అమలు ఘనత సీఎం జగన్‌దే

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు
- మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగనన్న బ్రోచర్ల ఆవిష్కరణ



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

**రేపల్లె:** ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. ఈనెల 7 నుంచి 20 వరకు జరగనున్న మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమ బ్రోచర్లను రేపల్లె పార్టీ కార్యాలయంలో ఆయన బుధవారం ఆవిష్కరించారు. అనంతరం మోపిదేవి మాట్లాడారు. మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలే కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా మరికొన్ని పథకాలను అమలు చేసి ప్రజాభిమానాన్ని చూరగొన్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ప్రజలను మభ్యపెట్టడం, మోసగించటం చంద్రబాబు నైజమైతే, ప్రజలకు మంచి చేయటం జగనన్న నైజమని స్పష్టం చేశారు. 2014 అంతకుముందు జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను పదిశాతమైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. అధికారం కోసం కల్లబొల్లి మాటలు చెప్పటం చంద్రబాబుకు పరిపాటిగా మారిందని విమర్శించారు. ఈ నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా జగనన్న చేసిన మేలులను, 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో చంద్రబాబు చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి చెప్పాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ఈ నెల 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాలలో పార్టీ నాయకులతో పాటు సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మహిళా కన్వీనర్ కొత్తపల్లి శ్రీవాణి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# జగ్జీవన్‌రామ్‌కు జేజేలు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న బాపట్ల వ్యవసాయ కళాశాల డీన్ శ్రీనివాసరావు



బాపట్లలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు



భట్టిప్రోలు మండలం పెదలంకలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**బాపట్ల/బాపట్ల అర్బన్/భట్టిప్రోలు/కర్లపాలెం/కొల్లూరు/వేమూరు :** మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు అజరామరమని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు చెప్పారు. కళాశాలలో జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవాన్ని బుధవారం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ గొప్పదనాన్ని వివరించారు. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పమాలలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎస్.రత్నకుమారి, డాక్టర్ కె.శ్రీనివాసులు, డాక్టర్ టి.మధుమతి విద్యార్థులు పాల్గొన్నారు.

- బాపట్ల పట్టణంలోని విశ్వశాంతి స్కూల్ ఆవరణలో జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల డైరెక్టర్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ యువజన అధ్యక్షుడు ఎన్.ఎస్.పి.రాజు, బీసీ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు గొర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు దున్నా తిరుపతి బాబు, నన్నెపాముల చంటి, డొక్కు నాగకుమారి, కొతరపు పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, డొక్కు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. భట్టిప్రోలు పంచాయతీ అద్దేపల్లి ఇందిరానగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం జరిగింది. సీపీఎం మండల కార్యదర్శి జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.
- బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో భట్టిప్రోలు మండలం పెదలంక ఇందిరా నగర్‌లో బుధవారం బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. గ్రామస్తులు నన్నెపాముల ప్రసాదరావు, నన్నెపాముల బసవ నాగేంద్రం, చిలుమూరు రామమోహన్‌రావు, నన్నెపాముల నాగేశ్వరరావు, కారుమూరు బాబురావు, కొల్లూరు సురేష్, నన్నెపాముల మనోజ్ కుమార్, నన్నెపాముల గురవయ్య, కొల్లూరు కుమార్‌రాజా, చిలుమూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. రాచూరులో గ్రేట్ రాయల్స్ ఆఫ్ రాచూరు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, గ్రామ ఉప సర్పంచ్ చిల్కా రత్నబాబు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతి బాబు, అసోసియేషన్ చీఫ్ కో–ఆర్డినేటర్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సీనియర్ మేనేజర్ చిల్కా కుమార్ పాల్గొన్నారు.
- కర్లపాలెంలో మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీపీ యారం వనజ, ఎంపీడీఓ దాసరి రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి.కేశవనారాయణరావు జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కర్లపాలెం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సేవా సమాఖ్య ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో అంబేద్కర్ యువజన సేవా సమాఖ్య మండల గౌరవ అధ్యక్షుడు మందపాటి పరమానందకుమార్, మండల అధ్యక్షుడు పి.ధనుంజయ్‌రావు, ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, వీఆర్వో చంద్రశేఖర్, కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.
- కొల్లూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేతృత్వంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి స్వీట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు పాల్గొన్నారు. గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈపూరు, కొల్లూరు గ్రామాలలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కె.షాలెంరాజు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు బుల్లా నవరత్నం, బావిరెడ్డి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మెల సాంబయ్య, ఘంట శివరంగారావు, నర్ర బుల్లిబాబు, ఉప్పు శ్రీనివాసరావు, కూచిపూడి మోషే, చిలక ప్రకాశం, ఆళ్లమూడి మధు, మేకతోటి ఏలియ్య, కంచర్ల వెంకటేశ్వరరావు, సంగీతరావు, గరిక రమేష్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కొల్లూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కొల్లూరు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ..



వేమూరులో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు

- వేమూరు బస్టాండ్ సెంటరులో జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కోగంటి లవకుమార్, మండల కో–ఆప్షన్ మెంబరు తలతోటి సువర్ణరావు, దున్నా మేరీసుబాబు, దాసరి ముత్తయ్య, ఎలిచర్ల దేవదానం, గుమ్మడి దానియేలు, తేళ్ల సామియేలు, శ్రీక్రాంత్, ప్రసాద్, అమర్తలూరు వెంకయ్య, చిలకా మరియదాసు పాల్గొన్నారు.

# పశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

**జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు**



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు

**రేపల్లె:** పశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి హనుమంతరావు చెప్పారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని బేతపూడి గ్రామంలో బుధవారం లేగదూడల అందాల పోటీల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హనుమంతరావు మాట్లాడుతూ లేగ దూడల ఆరోగ్య సంరక్షణ చాలా ముఖ్యమన్నారు. పశు సంపద పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, పశు ఆరోగ్యం కోసం 1962 డాక్టర్ వైఎస్సార్ పశు సంచార వాహనాలను(అంబులెన్సు) ప్రవేశపెట్టిందని వివరించారు. అనంతరం జరిగిన పోటీల్లో పేటేరుకు చెందిన డొక్కు రామాంజనేయులు, బేతపూడికి చెందిన యార్లగడ్డ కుమారస్వామి, గూడూరు రాజారావు, పేటేరుకు చెందిన తోడేటి వెంకట స్వామీల లేగదూడలను విజేతలుగా ప్రకటించారు. వారికి బహుమతులు అందించారు. పోటీల్లో పాల్గొన్న అందరికీ ప్రోత్సాహక బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, సర్పంచ్ ఆలూరి పద్మ, ఎంపీటీసీ కొమరాబత్తుని జయమ్మ, సహాయ సంచాలకులు జి.నరేంద్ర బాబు, పశువైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, ఎం.నాగేశ్వరరావు, పి.మీనాక్షి దేవి, లక్ష్మీరంజిత, హేమాప్రియ, కరీముల్లా పాల్గొన్నారు.

# రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ పరిశీలన



పెనుమర్రులో రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేసిన స్థానికులు

**భట్టిప్రోలు:** భట్టిప్రోలు 277 రైల్వే గేట్‌ను రైల్వే శాఖ ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ రవీంద్రనాథ్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన ప్రత్యేక రైలులో రేపల్లె నుంచి తెనాలి వైపు వెళ్తూ భట్టిప్రోలు రైల్వే గేట్ వద్ద రైలును ఆపి గేట్‌మెన్ టి.వెంకటేశ్వరరావుతో మాట్లాడారు. గేటు పర్యవేక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట డీఆర్‌ఎం రామకృష్ణ, ఏడీఆర్‌ఎం శ్రీనివాస్, రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు.

**రైల్వే అధికారులకు వినతిపత్రం**

**పెనుమర్రు(వేమూరు):** రైల్వేశాఖ ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం పెనుమర్రు రైల్వేస్టేషన్ సమీపంలోని గేటును, ట్రాక్‌ను పరిశీలించారు. భద్రతాపరంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పెనుమర్రు స్టేషన్‌లో కొన్ని రైళ్లు ఆగడం లేదని వాటిని పునరుద్ధరించాలని వినతిపత్రం అందించారు. దీనికి స్పందించిన గుంటూరు రైల్వే డివిజనల్ అసిస్టెంట్ అధికారి సైమన్ మాట్లాడుతూ ప్లాట్‌ఫాంల మరమ్మతులు చేస్తున్నామని, అన్ని రైళ్లు నిలిచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పెనుమర్రు, కోడిపర్రు గ్రామ సర్పంచ్‌లు, కొక్కిలగడ్డ సుమతి, పిల్లి సామ్రాజ్యం ఉన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు**



ఆసరా చెక్కును అందిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



వేమూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

**నిజాంపట్నం/వేమూరు:** డ్వాక్రా స్వయం సహాయక సంఘాల కష్టాలు చూసి మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని తీసుకురావడం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. నిజాంపట్నంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోపిదేవి వెంకట రమణారావు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. రానున్న రోజుల్లో మహిళలందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. అనంతరం మహిళలకు రూ.13కోట్ల 66 లక్షల విలువైన చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, డీసీఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జునరావు, జెడ్పీటీసీ నర్రా సుబ్బాయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, వైస్ ఎంపీపీలు ఉన్నవ వెంకటేశ్వర్లు, తోటకూర సుబ్బారావు, ఎంపీటీసీ నాజర్‌ఖాన్, తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో నాగలక్ష్మి, ఏపీఎం కృపాసాగర్ పాల్గొన్నారు.

- వేమూరు మార్కెట్ యార్డులో వైఎస్సార్ ఆసరా సంబరాలను బుధవారం నిర్వహించారు. ఎంపీపీ యల్లమాటి మోహన్, జెడ్పీటీసీ గాజుల హేమలత మహిళలకు చెక్కును అందజేశారు. అనంతరం మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన బొల్లిముంత ఏడుకొండలు, విష్ణుమొలకల వెంకట రెడ్డియ్య, గాజుల భాను ప్రకాశ్, మండల ఉపాధ్యక్షులు షేక్ బాజీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు తలతోటి థెరిసా, ఇన్‌చార్జి ఎంపీడీవో సునీత, ఏపీఎం శోభనబాబు, సీసీలు బుల్లిబాబు, మేరీ, సాయి పాల్గొన్నారు.

### హనుమాన్ చాలీసా

**జంపని(వేమూరు):** జంపని వీరాంజనేయ స్వామి ఆలయంలో వార్షిక మండల దీక్ష హనుమాన్ చాలీసా పారాయణం బుధవారం ప్రారంభించారు. నిత్యం నిర్వహించే ఈ సామూహిక చాలీసా పారాయణం మే 14న హనుమజ్జయంతి పర్వదినం వరకు కొనసాగుతుందని అర్చకులు శ్రీనివాస మూర్తి తెలిపారు. తొలిరోజు వీరాంజనేయ భక్త సమాజం, తిరుమల తిరుపతి దేవస్థాన దాస సాహిత్య ప్రాజెక్ట్ భజన మండలి, శ్రీ హనుమాన్ యువజన భక్త సమాజం, సీతారామాంజనేయ భక్తి సమాజాల సభ్యులు పారాయణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### జనార్దనస్వామి కల్యాణం

**కర్లపాలెం:** అగ్రహారంలోని జనార్దనస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి శ్రీభూనీలా సమేత జనార్దనస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. బుధవారం ఉదయం స్వామికి హోమగుండం పూజలు చేసి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం గరుడ వాహనంపై స్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు అన్న సంతర్పణ చేశారు. రాత్రి స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి రథోత్సవం నిర్వహించారు.

### గాలికుంటు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

**నగరం:** పశువులకు వ్యాపించే సీజనల్ వ్యాధులపై పోషకులకు అవగాహన ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ కరిముల్లా చెప్పారు. పూడివాడలో బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ జరిగింది. డాక్టర్ కరిముల్లా మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం 106 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాగోలు సుజాత, ఎంపీటీసీ మన్నెం పద్మావతి పాల్గొన్నారు.

### చలివేంద్రం ప్రారంభం

**రేపల్లె రూరల్:** పేటేరు గ్రామంలో గ్రామదేవత మహాలక్ష్మి గుండెపాటెమ్మ అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో ఆలయ సమీపంలో బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ కనపర్తి వసుమతి ప్రారంభించారు. తాగునీటిని, మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జ్ కనపర్తి రవికిరణ్, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకర్, సచివాలయ సెక్రటరీ పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

### చెరువులో పడి మహిళ ఆత్మహత్య

**ఐలవరం(భట్టిప్రోలు):** అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. భట్టిప్రోలు మండలం ఐలవరానికి చెందిన ఉద్దంటి లక్ష్మి కాంతం(55) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. మంగళవారం రాత్రి గ్రామంలోని పైడమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం మృతదేహం చెరువులో తేలియాడుతుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు చెరువు వద్దకు వచ్చి మృతదేహాన్ని బయటకు తీయడంతో లక్ష్మీకాంతంగా గుర్తించారు. మృతదేహాన్ని శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ తెలిపారు.

### వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థినికి ప్రతిభా ప్రోత్సాహం

**బాపట్ల అర్బన్:** బాపట్ల ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం విద్యార్థిని బి.నాగ చంద్రికకు ప్రతిభా ప్రోత్సాహకంగా బాపట్ల పట్టణ లయన్స్ క్లబ్ కోశాధికారి, ఎన్టీఆర్ క్లబ్ సభ్యుడు, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ఉద్యోగి వంకాయలపాటి హరిబాబు రూ.8వేల నగదును అందించారు. కార్యక్రమంలో బాపట్ల పట్టణ లయన్స్ క్లబ్ అధ్యక్షులు అల్లపర్తి శ్రీనివాసరావు, సీనియర్ సభ్యులు బూరుగుల సంగమేశ్వర శాస్త్రి, గోపాళం రఘుపతి రావు, శిఖరం ఫణి రాజశయన్ పాల్గొన్నారు.